## క్లుప్తంగా

### ఒకరిపై ఈవ్‌టీజింగ్ కేసు

మడికొండ: ఒకరిపై ఈవ్‌టీజింగ్ కేసు నమోదు చేసినట్లు ఎస్‌హెచ్‌ఓ కిషన్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం మడికొండ గ్రామానికి చెందిన ఆకుల అఖిల్ ఓ మహిళను పెళ్లి చేసుకొని విడాకులు తీసుకున్నాడు. మరో అమ్మాయిని ప్రేమించి మోసం చేశాడు. ఈక్రమంలో కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ పులాల కిషన్ వివరించారు.

### 30నుంచి సీవీవీ ధ్యాన యోగా సమావేశాలు

ఖిలా వరంగల్: ఈనెల 30నుంచి జనవరి 1వ తేదీ వరకు వరంగల్ శివనగర్‌లోని మాస్టర్ సీవీవీ యోగా క్షేత్రంలో ధ్యాన యోగాపై ప్రత్యేక శీతాకాల ప్రార్థన సమావేశాలు నిర్వహించనున్నట్లు యోగా గురువు మాస్టర్ డీవీ.హనుమంతరావు తెలిపారు. శివనగర్‌లో క్షేత్రంలో బుధవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రోగగ్రస్తులకు యోగాతో స్వస్థత చేకూర్చనున్నట్లు వివరించారు.

### విద్యుత్ ఉద్యోగుల సంక్షేమానికి కృషి



హన్మకొండ: విద్యుత్ ఉద్యోగుల సంక్షేమానికి తెలంగాణ స్టేట్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ -327 పాటుపడుతోందని యూనియన్ రాష్ట్ర సెక్రటరీ జనరల్ ఇనుగాల శ్రీధర్ అన్నారు. హనుమకొండ వడ్డేపల్లి రోడ్డులోని పల్లా రవీందర్ రెడ్డి భవన్‌లో టీఎస్‌ఈఈయూ -327 రాష్ట్ర సీనియర్ వర్కింగ్ ప్రెసిడెంట్ నీలం ఐలేష్ పుట్టిన రోజు వేడుకలను బుధవారం జరుపుకున్నారు. కార్యక్రమంలో టీఎస్‌ఈఈయూ -327 ఎన్పీడీసీఎల్ కంపెనీ అధ్యక్షుడు పి.మహేందర్ రెడ్డి, హనుమకొండ జిల్లా అధ్యక్షుడు సదయ్య, కార్యదర్శి చిట్ల ఓదెలు, వరంగల్ జిల్లా అధ్యక్షుడు గుండ శ్రీనివాస్, నాయకులు అనిల్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

### దుప్పట్ల పంపిణీ



హసన్‌పర్తి: వర్ధన్నపేట నియోజకవర్గ పరిధిలోని 272 చర్చీల్లో యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు కేఆర్.దిలీప్‌రాజ్ ఆధ్వర్యంలో బుధవారం దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి వరుణ్, నియోజకవర్గ అధ్యక్షుడు ఆవుల పవన్ కల్యాణ్, యూత్ కాంగ్రెస్ హసన్‌పర్తి మండల అధ్యక్షుడు వీర సుధాకర్, ప్రధాన కార్యదర్శి అనిల్, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ వీసం సురేందర్‌రెడ్డి, డివిజన్ అధ్యక్షుడు కిరణ్‌తో పాటు నాయకులు ఆరెల్లి వెంకటస్వామి, యుగంధర్, సుమంత్, రాహుల్, వంశీకిరణ్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

### బ్లాంకెట్ల పంపిణీ



కాజీపేట అర్బన్: క్రిస్మస్ పర్వదినం సందర్భంగా కాజీపేట మండల పరిధిలోని కడిపికొండ, భట్టుపల్లి, కొత్తపల్లి, తరాలపల్లి, కుమ్మరిగూడెం గ్రామాల్లో జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు కేఆర్.దిలీప్ ఆదేశాల మేరకు కాంగ్రెస్ నాయకులు బుధవారం బ్లాంకెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ బస్కేశ్రీలేఖ, నాయకుడు కర్ర హరీష్‌రెడ్డి, కట్కూరి రేవంత్, బస్కే ప్రణయ్, ఆకారపు శివాజీ, రవి, జక్కుల రాజు, కృష్ణ, హరిచందర్, శ్రీనివాస్, ఉదయ్ తదితరులు పాల్గొన్నారు.

### రక్తదానం.. ప్రాణదానం



ఎంజీఎం: రక్తదానం చేస్తే మరొకరి ప్రాణదానం చేసినట్లేనని రైల్వే కార్మిక సంఘాల నాయకుడు ముత్యాల విజయ్ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్‌రెడ్డి జన్మదినం సందర్భంగా ఎంజీఎం ఆస్పత్రిలో విజయ్‌తో పాటు మరో ఐదుగురు బుధవారం రక్తదానం చేశారు. కార్యక్రమంలో బ్లడ్ బ్యాంక్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

### రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌పై దాడిని ఖండిస్తున్నాం

ఐనవోలు: మేడ్చల్ జిల్లా జవహర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని దేవేంద్ర నగర్ (కాప్రా) రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రమేశ్‌పై జరిగిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నట్లు ట్రెంగ జిల్లా అధ్యక్షుడు, ఆర్ఐ మరుపట్ల మల్లయ్య బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వం విచారణ చేపట్టి దోషులను వెంటనే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని పేర్కొన్నారు. ఉద్యోగులకు భద్రత కల్పించాలని ప్రభుత్వానికి ఆయన విజ్ఞప్తి చేశారు.

# బ్రిడ్జిపై తవ్వారు

- పైపులైన్ కోసం నయీంనగర్ వంతెనను తవ్విన బల్దియా సిబ్బంది
- అధికారుల అలసత్వంతో ప్రజాధనం దుర్వినియోగం



బ్రిడ్జిపై తవ్విన బల్దియా సిబ్బంది



నయీంనగర్ బ్రిడ్జి

నయీంనగర్: గ్రేటర్ వరంగల్ స్మార్ట్ సిటీలో బల్దియా అధికారుల పర్యవేక్షణ లేక అభివృద్ధి పనులు అధ్వానంగా మారుతున్నాయి. రాష్ట్రంలో రెండు పార్టీల మధ్య చర్చగా మారిన నయీంనగర్ బ్రిడ్జిని ఇటీవలే పూర్తిచేసి సుందరీకరించారు. తాగునీటి పైపులైన్‌ను కలపడానికి బల్దియా ఇంజనీరింగ్, వాటర్ సప్లై సిబ్బంది సోమవారం ఈ బ్రిడ్జిని తవ్వారు. బ్రిడ్జి నిర్మాణ సమయంలో పైపులైన్‌ను వంక బెండుతో కలపకుండా అధికారులు నిర్లక్ష్యం వహించి ఇప్పుడు మరల బ్రిడ్జిని తవ్వి ఇనుప పైపుతో కలుపుతున్నారు.

**తెగిపోయిన బీఎస్ఎన్ఎల్ కేబుళ్లు**

బ్రిడ్జిని తవ్వడంతో బీఎస్ఎన్ఎల్ కేబుళ్లు, ఆప్టిక్ ఫైబర్ కేబుళ్లు తెగిపోవడంతో పరకాల ప్రాంతంలో బీఎస్ఎన్ఎల్ సేవలకు అంతరాయం ఏర్పడిందని గుంతను పరిశీలించడానికి వచ్చిన బీఎస్ఎన్ఎల్ అధికారులు తెలిపారు. ఇష్టానుసారంగా పలు చోట్ల తవ్వడంతో బీఎస్ఎన్ఎల్ వైర్లు తెగిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజాధనాన్ని తమ నిర్లక్ష్యంతో దుర్వినియోగం చేస్తున్న బల్దియా సిబ్బందికి జరిమానా విధించి, నష్టాన్ని వారే భరించే విధంగా జీతాల్లో నుంచి కోత పెట్టాలని ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు.

## బాక్సింగ్ క్రీడాకారులకు అభినందనలు



క్రీడాకారులను అభినందిస్తున్న అశోక్‌కుమార్

వరంగల్ స్పోర్ట్స్: వచ్చే ఏడాది జనవరి 10నుంచి 12వ తేదీ వరకు పాండిచ్చేరిలో జరగనున్న సౌత్ జోన్ బాక్సింగ్ పోటీలకు ఎంపికైన డీఎస్ఏ క్రీడాకారులు అఫ్రీన్, భార్గవ్‌ను డీవైఎస్ఓ గుగులోత్ అశోక్‌కుమార్ అభినందించారు. ఈ నెల 20, 21వ తేదీల్లో హైదరాబాద్‌లోని షేక్‌పేటలో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో అండర్ -14 విభాగంలో అఫ్రీన్ గోల్డ్, భార్గవ్ పాల్గొని వెండి పతకాలు సాధించారు. ఈమేరకు హనుమకొండ ఇండోర్ స్టేడియంలోని డీఎస్ఏ కార్యాలయంలో ఖేలో ఇండియా బాక్సింగ్ కోచ్ దేవరకొండ ప్రభుదాస్‌తో కలిసి క్రీడాకారులను డీవైఎస్ఓ అభినందించారు.

## ఎన్‌సీసీ కేడెట్లకు ఘన సన్మానం



కేడెట్లను అభినందిస్తున్న ప్రిన్సిపాల్, తదితరులు

కేయూ క్యాంపస్: ఇటీవల కర్ణాటక బెల్గాం జిల్లాలో నిర్వహించిన జాతీయ స్థాయి ఎన్‌సీసీ కేడెట్ల ట్రెక్కింగ్ క్యాంపులో హనుమకొండలోని యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ఎయిర్‌వింగ్ కేడెట్లు అనిల్‌కుమార్, నవీన్, మహేష్ పాల్గొని ప్రతిభ కనపర్చి మొదటి బహుమతి సాధించారు. వారిని ప్రిన్సిపాల్ జ్యోతి, తదితరులు కళాశాలలో బుధవారం అభినందించారు. చదువులోనూ రాణించి ఉన్నత స్థానానికి చేరుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పుల్ల రమేష్, ఎన్‌సీసీ అధికారి ఫ్లయింగ్ ఆఫీసర్ డాక్టర్ ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

## ఆచరణాత్మక అమలుతోనే సుపరిపాలన



మాట్లాడుతున్న విద్యాసాగర్ రెడ్డి

కేయూ క్యాంపస్: పాలనా నిర్ణయాలు, విధానాలు ఆచరణాత్మకంగా అమలు జరిగినప్పుడే సుపరిపాలన సాధ్యమవుతుందని కాకతీయ యూనివర్సిటీ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ అండ్‌హెచ్ఆర్ఎం విభాగం రిటైర్డ్ ప్రొఫెసర్ విద్యాసాగర్‌రెడ్డి అన్నారు. భారత మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి శత జయంతిని పురస్కరించుకొని సుపరిపాలన దినోత్సవాన్ని హనుమకొండలోని ప్రొఫెసర్ గజ్జెల రామేశ్వరం అంతర్జాతీయ ప్రకృతి గ్రంథాలయం, పరిశోధన కేంద్రంలో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పరిపాలనలో అన్నివర్గాల ప్రజలకు ప్రాతినిథ్యం అవసరమన్నారు. సమావేశంలో తెలంగాణ జనవేదిక కన్వీనర్ డాక్టర్ ఆకుతోట శ్రీనివాస్, అటల్ ఫౌండేషన్ అవార్డు గ్రహీత, ప్రకృతి వైద్య గ్రంథాలయ వ్యవస్థాపకుడు ఆచార్య గజ్జెల రామేశ్వరం, కిసాన్ సంఘ్ బాధ్యుడు శ్రీనివాస్, దొంగరి నాగభూషణం, డాక్టర్ ఉమాశంకర్, చిట్టిమళ్ల శ్యాం ప్రసాద్, పింగిళి ప్రవీణ్‌కుమార్, కృష్ణారావు, లైబ్రేరియన్ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## మనుధర్మ శాస్త్ర ప్రతుల దహనం



మనుధర్మ శాస్త్ర ప్రతులను దహనం చేస్తున్న డీబీఎఫ్ నాయకులు

హసన్‌పర్తి: మనువాద ధర్మశాస్త్ర ప్రతులను హసన్‌పర్తి మండలం దేవన్నపేటలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద బుధవారం దహనం చేశారు. ఈ సందర్భంగా దళిత బహుజన ఫ్రంట్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాజేందర్ మాట్లాడుతూ ఏ దేశంలో లేని కులవ్యవస్థ భారతదేశంలో పెట్రేగి పోతోందని ఆందోళన వ్యక్తంచేశారు. అంబేడ్కర్‌ను అవమానించిన కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షాను వెంటనే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో డీబీఎఫ్ జిల్లా కార్యదర్శి చుంచు నరేష్, నాయకులు కృష్ణ, సుందరయ్య, ప్రవీణ్, నందిపాక సంపత్, రమేష్, చంటి, రాజయ్య, శ్రీనివాస్ పాల్గొన్నారు.

### మనుధర్మశాస్త్రమే కారణం

కమలాపూర్: సమాజంలో నెలకొన్న అనేక అసమానతలు, కుల వివక్ష, అంటరానితనం, స్త్రీలపై జరిగే దాడులు, దౌర్జన్యాలకు మనుధర్మ శాస్త్రమే కారణమని, అందుకే దాన్ని 1927వ సంవత్సరం డిసెంబర్ 25న అంబేడ్కర్ దహనం చేశారని దళిత బహుజన ఫ్రంట్ (డీబీఎఫ్) జిల్లా అధ్యక్షుడు మాదాసి సురేష్ గుర్తుచేశారు.

## ఆలయంలో ఎమ్మెల్యే నాయిని పూజలు



పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే

హన్మకొండ: హనుమకొండ హౌజింగ్ బోర్డు కాలనీలోని లక్ష్మీనారాయణ స్వామిని వరంగల్ పశ్చిమ ఎమ్మెలే నాయిని రాజేందర్ రెడ్డి బుధవారం దర్శించుకున్నారు. దేవాలయ దశమ వార్షికోత్సవాలు, ధనుర్మాస ఉత్సవాల్లో నాయిని రాజేందర్ రెడ్డి, నీలిమ దంపతులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ 51వ డివిజన్ అధ్యక్షుడు కొండ నాగరాజు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నాయిని లక్ష్మారెడ్డి, నాయకులు సబిత రెడ్డి, వినోద, అరుణ, సాయిరాం, రవి నాయక్, అనిల్, అరుణ్, శ్రీనివాస్ రెడ్డి, సలీం, రామన్న హౌసింగ్ కాలనీ వాసులు పాల్గొన్నారు.

## పాజిటివ్ దృక్పథంతో ముందుకు సాగాలి



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న అతిథులు

- సీబీఐ రిటైర్డ్ డైరెక్టర్ జేడీ.లక్ష్మీనారాయణ

హసన్‌పర్తి: విద్యార్థులు పాజిటివ్ దృక్పథంతో ముందుకు సాగితే విజయం తథ్యమని సీబీఐ రిటైర్డ్ డైరెక్టర్ జేడీ.లక్ష్మీనారాయణ సూచించారు. భీమారంలోని శివానీ పాఠశాలలో విశ్రుత్ ఫెస్ట్‌ను బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీవితం అంటే నిన్ను నువ్వు చూసుకోవడం కాదు.. నిన్ను నువ్వు రూపుదిద్దుకోవడమని అన్నారు. తొలుత జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమాన్ని పురస్కరించుకుని విద్యార్థుల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ తాళ్లపల్లి స్వామి, డైరెక్టర్లు సురేందర్‌రెడ్డి, చంద్రమోహన్, రాజ్‌కుమార్, రమేష్, మురళీధర్, సంతోష్‌రెడ్డి, వి.సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## సెంట్రల్ లైటింగ్ సిస్టం ఏర్పాటు



సెంట్రల్ లైటింగ్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

హసన్‌పర్తి: నగరంలోని 65వ డివిజన్ నిరూప్‌నగర్ తండాలో సెంట్రల్ లైటింగ్ సిస్టంను స్థానిక ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు బుధవారం రాత్రి ప్రారంభించారు. సుమారు రూ.90 లక్షల వ్యయంతో మూడు కిలోమీటర్ల మేర సెంట్రల్ లైటింగ్‌ను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ విలీన గ్రామాల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. తండాల అభివృద్ధికి ఎక్కువ మొత్తంలో నిధులు తీసుకొస్తానని అన్నారు. కార్యక్రమలో స్థానిక కార్పొరేటర్ గుగులోతు దివ్యరాణి, మాజీ కార్పొరేటర్ గుగులోతు రాజునాయక్, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## అటల్ బిహారీ వాజ్‌పేయికి నివాళి

మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి శత జయంతి ఉత్సవాలను నగర వ్యాప్తంగా బీజేపీ నాయకులు బుధవారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. - సాక్షి నెట్‌వర్క్



హనుమకొండ దీన్‌దయాళ్ నగర్‌లో వాజ్‌పేయి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు



రెడ్ క్రాస్‌లో వాజ్‌పేయి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు



ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రిలో పండ్లు పంపిణీ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే ధర్మారావు, నాయకులు



ఆర్టీఏ జంక్షన్‌లో కేక్ కట్‌చేస్తున్న బీజేపీ వరంగల్ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్, మాజీ ఎమ్మెల్యే అరూరి రమేష్, నాయకులు



మడికొండ చౌరస్తాలో వాజ్‌పేయి జన్మదిన వేడుకల్లో పాల్గొన్న నాయకులు



కాజీపేటలో వాజ్‌పేయి జయంతిలో నగర మాజీ మేయర్ రాజేశ్వర్‌రావు, తదితరులు



కాశిబుగ్గలో పారిశుద్ధ్య సిబ్బందికి దుప్పట్లు పంపిణీ చేస్తున్న బీజేపీ నాయకులు



హసన్‌పర్తి: వాజ్‌పేయి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

# ఘనంగా క్రిస్మస్ సంబురాలు

క్రిస్మస్ పర్వదిన వేడుకలను నగర వ్యాప్తంగా క్రిస్టియన్లు బుధవారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా చర్చీల్లో కేక్‌లు కట్ చేసి సంబురాలు జరుపుకున్నారు. ఫాదర్లు, పాస్టర్లు దైవ సందేశం ఇచ్చారు. ఈమేరకు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. చిన్నారుల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

- సాక్షి నెట్‌వర్క్




మడికొండ యునైటెడ్ చర్చిలో కేక్ కట్‌చేస్తున్న ఆయిల్, సీడ్స్ ఫెడరేషన్ చైర్మన్ జంగా రాఘవరెడ్డి



గిర్మాజీపేట ఎల్-రోయి చర్చిలో కేక్ కట్ చేస్తున్న టీపీసీసీ కార్యదర్శి మీసాల ప్రకాశ్, తదితరులు



వరంగల్ 18వ డివిజన్‌లోని బేతెస్త చర్చిలోని క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్, నాయకులు



పడమరకోట చర్చిలో కేక్ కట్ చేస్తున్న కార్పొరేటర్లు సువర్ణ, ఉమ



రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ చైర్మన్ సిరిసిల్ల రాజయ్యకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న పాస్టర్లు




కాజీపేట కార్మెల్ బాప్టిస్ట్ చర్చిలో దైవ సందేశం ఇస్తున్న సంఘ కాపరి పాస్టర్ నల్ల దేవిడ్



హసన్‌పర్తి: చర్చిలో కేక్ కట్ చేస్తున్న కార్పొరేటర్ జక్కుల రజిత, పాస్టర్లు

## రెగ్యులరైజ్ చేయాలని సమగ్ర శిక్ష ఉద్యోగుల భిక్షాటన

విద్యారణ్యపురి: తమను రెగ్యులరైజ్ చేయాలని, పేస్కేల్ వర్తింజేయాలని డిమాండ్ చేస్తూ సమగ్రశిక్ష ఉద్యోగులు డిమాండ్ చేశారు. ఈమేరకు హనుమకొండలో బుధవారం భిక్షాటన చేస్తూ నిరసన తెలిపారు. ఉద్యోగులు చేపట్టిన దీక్షలు బుధవారం 20వ రోజుకు చేరుకున్నాయి. సమ్మెలో వరంగల్ జిల్లా అధ్యక్షుడు దొనికల శ్రీధర్‌గౌడ్, హనుమకొండ జిల్లా అధ్యక్షుడు షఫీ, ఉద్యోగులు పాల్గొన్నారు.



భిక్షాటన చేస్తున్న ఉద్యోగులు



ఏకశిల పార్కు వద్ద సమ్మె చేస్తున్న సమగ్ర శిక్ష ఉద్యోగులు

## వరుణుడి భయం

- చిరుజల్లులతో రైతుల్లో కలవరం

ఖిలా వరంగల్: బంగాళాఖాతంలో తీవ్ర అల్పపీడనం ప్రభావంతో రైతుల్లో వరుణుడి భయం మొదలైంది. వరంగల్ జిల్లాలో చిరుజల్లులు కురుస్తున్నాయి. ప్రస్తుతం వరికోతలు 80శాతం పూర్తయ్యాయని అధికారులు చెబుతున్నారు. గతంలో పోలిస్తే ఈసారి జిల్లాలో వరికోతలు ఎక్కువగా యంత్రాలతోనే జరిగాయి. ఎక్కువశాతం రైతులు కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించారు. జిల్లాలో తొలుత 204 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయగా ధాన్యం కొనుగోళ్ల చివరి దశకు చేరుకోవడంతో ఇప్పటికే 80పైగా కొనుగోలు కేంద్రాలను ఎత్తివేశారు. వాతావరణ శాఖ ముందస్తు హెచ్చరికతో రైతులు అప్రమత్తమయ్యారు. కల్లాల్లో ఆరబెట్టిన ధాన్యాన్ని కాపాడుకునేందుకు రైతులు పరుగులు పెడుతున్నారు. వర్షం కారణంగా యంత్రాల సహాయంతో చేపడుతున్న వరికోతలను నిలిపివేశారు. కోసిన ధాన్యం త్వరగా ఆరేందుకు రహదారులపై ఆరబోశారు. వర్షాలకు తడవకుండా ధాన్యాన్ని కాపాడుకునేందుకు రైతుల వద్ద సరైన టార్పాలిన్లు లేక అవస్థలు పడుతున్నారు. గ్రామీణ ప్రాంత్రాల్లో కల్లాల్లోని ధాన్యాన్ని ఇంటికి తరలిస్తున్నారు. రైతులను మండల వ్యవసాయ అధికారులు అప్రమత్తం చేస్తున్నారు.



రోడ్డుపై ఆరబోసిన ధాన్యంపై కప్పిన టార్పాలిన్లు



బస్తాల్లో ధాన్యం నింపి తరలిస్తున్న అన్నదాతలు